విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

ఉద్యోగ, కార్మిక, రైతాంగ, ప్రజా సమస్యలపై

ఆగస్టు 9న చలో విజయవాడ

కేంద్ర కార్మిక సంఘాల పిలుపు

విశాలాంధ్ర - కాకినాడ : మోదీని సాగనంపండి-దేశాన్ని కాపాడండి నినాదంతో కేంద్ర కార్మిక సంఘాలన్నీకలిపి ఆగస్టు 9వ తేదీన విజయవాడలో నిర్వహించే మహాధర్నా జయప్రదం చేయాలని ఉద్యోగ, కార్మిక, రైతాంగానికి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కాకినాడ సిఐటియు కార్యాలయంలో జరిగిన కేంద్ర కార్మిక సంఘాల సన్నాహక సమావేశంలో ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజకుమార్, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జే వెంకటేశ్వరరావు, ఐఎన్టీయూసీ ఏపీ అండ్ తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లూరి రాజు మాట్లాడుతూ, కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మికులకు ఆసరాగా ఉండే 44 కార్మిక చట్టా లను రద్దు చేస్తూ, యజమానులకు అనుకూ లంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లు రాష్ట్రంలో అమలు జరిగితే సుమారు కోటి మంది కార్మికులు ఏ హక్కులు లేని బానిసలుగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తక్షణమే రాష్ట్రంలో నాలుగు లేబర్ కోడ్ల అమలుని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలకు, నిరుద్యోగం పెరగడానికి, దళితులు, మైనారి టీలపై దాడులు జరగడానికి, ప్రజల కొనుగోలు శక్తిని హరించి దేశం ఆర్థిక సంక్షోభంలోకి నెట్టడానికి కారణమయ్యే బీజేపీ విధానాలు అంతగా నచ్చినట్లయితే వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలను బీజేపీలో విలీనం చేస్తే మంచిదని సలహా ఇచ్చారు. తక్షణం కాంట్రాక్టు అవుట్సోర్సింగ్ ఉద్యోగులను, స్కీం వర్కర్లను రెగ్యులర్ చేయాలని, అసంఘటిత కార్మికులైన భవన నిర్మాణ కార్మికులు, హమాలి, ఆటో, ట్రాన్స్ పోర్ట్ కార్మికులను ఆదుకోవడానికి సంక్షేమ బోర్డులు ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. జులై 27న జిల్లా సదస్సు కాకినాడలో నిర్వహించాలని, ఆగస్టు 2వతేదీన మెయిన్ రోడ్డు పోస్టాఫీస్ వద్ద చలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరణ చేయాలని, ఆగస్టు 7వతేది కాకినాడలో ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించాలని, ఆగస్టు 9న వేలాదిగా విజయవాడకు తరలివెళ్లాలని కార్యాచరణ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షులు పప్పు ఆదినారాయణ, పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సత్తిరాజు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నర్ల ఈశ్వరి, చంద్రమళ్ల పద్మ, సిఐటియు నగర ఉపాధ్యక్షులు మేడిశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలు వీధి దీపాల వెలుగులు

పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర - గొల్లప్రోలు : ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపుతో సామాన్యుడి నడ్డి విరుస్తుంటే మరో వైపు అధికారుల నిర్లక్ష్యంతో ఇష్టారీతిగా పగలనక, రాత్రనక వీధి లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. కాకినాడ జిల్లా గొల్లప్రోలులోని 8వ వార్డు రెల్లిపేట నందు వారం రోజుల నుంచి విద్యుత్ వీధి దీపాలు పగలనక, రాత్రనక వెలుగుతూనే ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో రాత్రి కూడా సరిగా పనిచేయని వీధి దీపాలను పట్టించుకోని అధికారులు పగలు కూడా నిరంతరాయంగా వీధి దీపాలు వెలగడం చూసి ప్రజలు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ఇలా వెలుగుతున్న వీధి దీపాలపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకున్న పాపాన పోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. రాత్రి వేళల్లో విద్యుత్ వీధి దీపాలు సక్రమంగా వెలిగితే చాలు పట్టపగలు అవసరం లేదని, అధికారులు నిర్లక్ష్యం వీడి వీధి దీపాలపై శ్రద్ధ వహించాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.

రూ.6.36 కోట్లతో జలజీవన్ పనులు ప్రారంభం

విశాలాంధ్ర - జగ్గంపేట : జగ్గంపేట గ్రామంలో 6,800 కుళాయిలకు మంచినీటిని అందించేందుకు 6.36 కోట్ల రూపాయల జలజీవన్ మిషన్ నిధులతో పనులను చేపట్టడం జరిగిందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సేవాదళ్ జనరల్ సెక్రెటరీ ఒమ్మి రఘురామ్ అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన జగ్గంపేటలో ఈ జలజీవన్ మిషన్ పనులను ఉప సర్పంచ్ బండారు రాజా, ఎంపీటీసీ సభ్యులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈ కార్యక్రమం కొనసాగుతుందని, ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం ఇంటింటికి కుళాయి ఇవ్వడమే అన్నారు. ఉప సర్పంచ్ రాజా మాట్లాడుతూ ఇప్పటికే సత్యవేణి పేటలో ఒక ట్యాంక్, ఎంప్లాయిస్ కాలనీలో ఒక ట్యాంక్ నిర్మించడం జరిగిందన్నారు. పైప్ లైన్ పనులను పూర్తి చేసి మరో మూడు నెలల్లో ఇంటింటికి కుళాయి వేసి మంచినీరు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుయస్ ఏఈ రాంజీ, వార్డ్ మెంబర్లు చిట్టి మాని సత్యనారాయణ, బట్టు శ్రీను, వైసీపీ నాయకులు, గోల్లవిల్లి శ్రీను, కేసుబోయిన కుమార్, పార్టీ నాయకులు బచ్చల సుదీర్, పాల్గొన్నారు.

22న మండల పరిషత్ సమావేశం

విశాలాంధ్ర:-దేవరపల్లి: దేవరపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 22వ తేదీన మధ్యాహ్నం 2.30 నిమిషాలకు ఎంపీపీ కేవీకే దుర్గారావు అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో కృష్ణంరాజు తెలిపారుజ ఈ సమావేశానికి ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు, అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

పద్య కవితా పోటీల్లో విజేత బీవీవీ సత్యనారాయణ

విశాలాంధ్ర - అమలాపురం : కవితాలయం, విజయవాడ వారు ప్రతీనెల మొదటివారంలో పద్యకవితా పోటీలు ఆన్లైన్ ద్వారా నిర్వహిస్తూ ఉంటారు. జూలై నెలకు గాను మన పద్యం-30 పేరుతో "వాన" అనే అంశంపై "చంపకమాల"లో పోటీలు నిర్వహించగా ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి అనేకమంది పోటీలో పాల్గొన్నారు. వారిలో నలుగురిని విజేతలుగా ఎంపికచేసి బుధవారం ప్రకటించారు. క్లిష్టమైన పద్యరచనలో ప్రతిభ కనబరచిన వారిలో అమలాపురానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త కవిరత్న బివివి సత్యనారాయణ విజేతగా నిలిచారు. ఈసందర్భంగా కవితాలయం నిర్వాహకులు కొండవీటి అంతయ్య, దేవపట్ల పవన్ కుమార్‌లకు కవి బివివి కృతజ్ఞతలు తెలిపారు. ఇది తనకు వరుసగా మూడు నెలలు కూడా సీసం, ఉత్పలమాల, చంపకమాల వంటి వృత్తపద్య విభాగాల్లో విజేతగా నిలిచి హ్యాట్రిక్ సాధించడం జరిగిందని తన ఆనందాన్ని పత్రికాముఖంగా పంచుకున్నారు. వచన కవిత్వంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ, ప్రోత్సాహక వంటి అనేక బహుమతులు అవార్డులు రివార్డులు సొంతం చేసుకున్నప్పటికీ పద్యరచనలో విజేతగా నిలవటం చాలా ఆనందాన్ని తృప్తిని ఇచ్చిందనీ, సాహితీపరంగా మరింత కృషిచేస్తానని తెలియ జేశారు. ఈసందర్భంగా విజేతగా నిలిచిన కవిరత్న బివివి సత్యనారాయణను శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ అక్షరతపస్వి డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జిల్లా అధ్యక్షుడు నడకకవి నల్లా నరసింహమూర్తి, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, అరిగెల బలరామమూర్తి, బాలార్జున సత్యనారాయణ, రవణం వేణుగోపాలరావు, యస్ఐ డి. రామకృష్ణ, యెండూరి సీతామహాలక్ష్మి, యెండూరి రాఘవ, జల్లి సుజాత, పోలిశెట్టి అనంతలక్ష్మి, అద్దంకి అమరేశ్వరరావు, గుర్రం రామకృష్ణ తదితరులు అభినందించారు.

పేదలకు రక్ష జగనన్న సురక్ష

విశాలాంధ్ర - ముమ్మిడివరం : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు పౌరులకు పౌర సేవలు ధ్రువ పత్రములు అందించే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముమ్మిడివరం నగర పంచా యతీలో కమిషనర్ జి.లోవరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మున్సిపల్ చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం పరిధిలోగల ప్రజలకు 11 రకాల సేవలు ఉచితంగా అందించనున్నట్టు తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బొంతు సత్య శ్రీనివాస్, గణేశుల అరుణ, సొసైటీ అధ్యక్షులు దొమ్మేటి అప్పారావు, సచివాలయ, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వారంలో ఇవ్వకుంటే కలెక్టరేట్ ముట్టడి



విశాలాంధ్ర - జగ్గంపేట : వారం రోజుల్లో పుష్కర కాలువ ద్వారా సాగునీరు ఇవ్వకుంటే రైతు కుటుంబీకుడిగా రైతులతో కలిసి కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ హెచ్చరికలు జారీ చేశారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమై జూలై 15వ తేదీ దాటినా పుష్కర కాలువ ద్వారా నీళ్లు ఇవ్వలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉందన్నారు. తాళ్లూరు లిఫ్టు మూడు పంపులు పాడైపోయి నిరుపయోగంగా ఉన్నా ఆ పంపులకు గ్రీజు కూడా పెట్టలేని స్థితిలో ఉందన్నారు. వారం రోజుల్లోగా ఈ పనులు చేపట్టకపోతే రైతులతో కలిసి కాకినాడ కలెక్టర్ ఆఫీసు ముట్టడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి పరిశీలకులు శీలం వెంకటేశ్వరరావు, కోర్పు లచ్చయ్య దొర, మారిశెట్టి భద్రం, పోతుల మోహనరావు, కొత్త కొండబాబు, జంపన సీతారామచంద్ర వర్మ, పాలకుర్తి ఆదినారాయణ, పాలచర్ల సత్యనారాయణ, యర్రంశెట్టి బాబ్జి, శీలా మంతుల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన సదుపాయాలు

విశాలాంధ్ర - పి గన్నవరం : ప్రభుత్వ ఆసుపత్రులలో సీఎం జగన్ మెరుగైన వైద్య సదుపాయాలను కల్పించేందుకు చర్యలు చేపడుతున్నారని పి గన్న వరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. ఈ మేరకు పి గన్నవరం సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన బయోకెమికల్ ఎనలైజర్ మిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన సురక్షిత మంచినీటి ఆర్‌ఓ ప్లాంట్లు ఆయన ప్రారంభించారు. తొలుత ఆసుపత్రి వద్ద నిర్వహించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమాలలో ఎంపీడీవో యం భారతి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అప్పారి సూర్యనారాయణ, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు తోలేటి బంగారు నాయుడు, మండల వైకాపా అధ్యక్షుడు నక్క వెంకటేశ్వరరావు, కుడిపూడి రాము, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి నెలరోజుల పాటు ఇంటింటి సర్వే

కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా

విశాలాంధ్ర - కాకినాడ : ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్)-2024 కార్యకలాపాల్లో భాగంగా ఈ నెల 21వ తేదీ నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా కృతికా శుక్లా తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కోర్టుహాల్‌లో కలెక్టర్ కృతికా శుక్లా..డీఆర్‌వో కె.శ్రీధర్‌రెడ్డితో కలిసి ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్)-2024 కార్యకలాపాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో దోష రహిత ఓటర్ల జాబితా రూపకల్పనకు భారత ఎన్నిక సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా కృషిజరుగుతోందని..ఈ కృషికి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు సహాయసహకారాలు అందించాలని కోరారు. వెంటనే గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు బూత్ స్థాయి ఏజెంట్ (బీఎల్ఏ)లను నియమించుకోవాలని సూచించారు. ఫారం 6, ఫారం 7, ఫారం 8లు బీఎల్‌వోలు, తహసీల్దార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ ఏడాది అక్టోబర్ 17న ఇంటిగ్రేటెడ్ ముసాయిదా ఓటర్లను జాబితాను ప్రదర్శించనున్నామని.. ఆపై నవంబర్ 30వ తేదీ వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరిస్తారని తెలిపారు. వీటిని డిసెంబర్ 26వ తేదీలోగా పరిష్కరించి.. 2024, జనవరి 5న తుది ఓటర్ల జాబితాను ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు. సమా వేశంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎం.జగన్నాథంతో పాటు ఆర్.వెంకటేశ్వరరావు(వైఎస్ఆర్ కాంగ్రెస్), చిక్కాల రామచంద్రరావు (తెలుగుదేశం), బీవీ నాయుడు (కాంగ్రెస్), ఎస్.అప్పారావు (బీఎస్పీ), కె.వీరబాబు (సీపీఎం), ఎన్.శివ(ఆమ్ ఆద్మీ పార్టీ) తదితరులు హాజరయ్యారు.

కేంద్ర కారాగారాన్ని సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష కుమారి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : బుధవారం తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె. ప్రత్యూష కుమారి రాజమహేంద్రవరం కేంద్ర కారాగారాన్ని సందర్శిం చారు. కారాగారంలోని ఆసుపత్రిలో సదుపాయాలను పరిశీలించి ఖైదీల ఆరోగ్య పరిస్థితులను వైద్యుల ద్వారా వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఖైదీలతో మాట్లాడారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నియమించిన పారా లీగల్ వాలంటీర్లు వారికి అందు బాటులో ఉంటారని, ఏ విధమైన న్యాయ సమస్యలు ఉన్నా వారి ద్వారా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు. మాదక ద్రవ్యాల కేసుల్లో శిక్షలు తీవ్రంగా ఉంటాయని, బెయిల్ లభించడం కూడా కష్టమని అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల దుష్ప్రభావాల గురించి వివరించారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, పరివర్తన చెంది గౌరవంగా జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో జైలు అధికారులు పాల్గొన్నారు.

ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: చేపట్టిన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని నిడదవోలు ఎమ్మెల్యే జి శ్రీనివాస్ నాయుడు అధికారులకు సూచించారు. బుధవారం మండలంలోని కాల్దరిలో జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.90.00 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించే ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయిర్ ట్యాంకు, పైపులైన్లు, త్రాగునీటి కుళాయిలు ఏర్పాటుకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం, అనేక సంక్షేమ కార్యక్రమాలతో పాటు ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను కూడా చేపట్టి ప్రజల ప్రభుత్వంగా ముందుకెళుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ నందిగం భాస్కర రామయ్య, వైస్ ఎంపీపీ, పి.ఏ.సి.ఎస్ చైర్మన్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ, ఆర్ దుర్గా భవాని, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లేఖర్ల సంఘ అధ్యక్షులుగా రామమోహన రెడ్డి

విశాలాంధ్ర - రావులపాలెం : స్థానిక రిజిస్ట్రేషన్ కార్యాలయ పరిధిలో బుధవారం దస్తావేజు లేఖర్లు సమావేశమై అధ్యక్షులుగా కొవ్వూరి రామమోహనరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షు లుగా యలమర్తి సుబ్బారావు, సెక్రటరీగా ద్వారంపూడి అప్పారెడ్డి, ట్రెజరర్‌గా పెచ్చెట్టి రాజశేఖర్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రామమోహన రెడ్డి మాట్లాడుతూ సభ్యులందరి సహకారంతో కలసి సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఇప్పటి వరకు పులుగుర్త రామారావు అధ్యక్షులుగా కొనసాగగా ఈ బాధ్యతలను కొవ్వూరి రామమోహన్ రెడ్డికి అప్పగించారు. అనంతరం సభ్యులు విందు స్వీకరించారు. అధ్యక్షులు కొవ్వూరి రామ మోహన రెడ్డిని సబ్ రిజిస్ట్రార్ రేవంత్, ఆఫీస్ సిబ్బంది, లేఖర్ల సంఘ సభ్యులు, స్టాంప్ వెండర్లు తదితరులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

మాదిగ జేఏసీ హర్షం

విశాలాంధ్ర - ఉప్పలగుప్తం : ఉప్పలగుప్తం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఏపీ అసెంబ్లీ దళితుల సంక్షేమ, అభివృద్ధి కమిటీ మెంబర్‌గా నియమితులైన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ నియామకం పట్ల ఉప్పలగుప్తం మాదిగల పొలిటికల్ జేఏసి హర్షం వ్యక్తం చేసింది. ఉప్పలగుప్తం పెద్దురు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ కమ్యూనిటీ హాల్ నందు చెట్ల విద్యాసాగర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల్లో అస్సలు రాజకీయ ప్రాధాన్యత లేని మాదిగలకు ఎమ్మెల్సీ ద్వారా రాజకీయ ప్రాధాన్యత కల్పించడమే కాకుండా ఎంఎల్సి మరొక్క ముఖ్య మైన పదవి ఇవ్వటం పట్ల సమావేశం ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియ జేసింది. ఈ సమావేశంలో తోత్తరమూడి బాబులు, చెట్ల శ్రీను, సత్తాల దుర్గారావు, ఈతకోట కృష్ణ, జొన్నాడ మనోహర్, మంద చిన్న, సవరపు చంటి, పెదపూడి నాగభూషణం, జోన్నాడ సత్యనారాయణ, లంక సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బస్సుయాత్ర జయప్రదం చేయండి

విశాలాంధ్ర - అమలాపురం : సీపీఐ అమలాపురం నియోజకవర్గ కార్యవర్గం సమావేశం బుధవారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో కామిశెట్టి నాగబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా కార్యదర్శి కే. సత్తి బాబు విచ్చేసి మాట్లా డారు. అమలాపురంలో రైతు సంఘం ఆధ్వర్యంలో బస్సు యాత్ర జయప్రదం చేయాలన్నారు. అమలాపురంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాలని, ఆగస్టు మొదటి వారంలో రాజకీయ శిక్షణ తరగతులు జరపాలని సమా వేశంలో నిర్ణయించారు. ఆగస్టు 7వ తేదీన రైతాంగ సమస్యలపై, ఆగస్టు 9న కార్మిక సమస్యలపై చలో విజయవాడ కార్యక్రమాలను జయప్రదం చేయుటకు సమాయత్తం కావాలని తెలియజేశారు. ఆగస్టు 25, 26 తేదీల్లో వ్యవసాయ కార్మిక సంఘం. బికేఎంయు జిల్లా మహాసభలు రావులపాలెంలో జరగనున్నాయని, ఆగస్టు 27న ఏఐవైఎఫ్ జిల్లా మహాసభ అమలాపురంలో నిర్వహించా లని పేర్కొన్నారు. అమలాపురం నియోజకవర్గ పార్టీ కార్యకలాపాలు సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లడానికి అందుకు కావలసిన వనరులు సమకూర్చు కోవాలని అందుకు జిల్లా నాయకత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో అమలాపురం అల్లవరం, ఉప్పలగుప్తం, మండల కార్య దర్శులు, యువజన సంఘ నాయకులు హాజరయ్యారు.

ధవలేశ్వరం వద్ద పెరుగుతున్న నీటి ప్రవాహం

విశాలాంధ్ర - కాకినాడ/అమలాపురం : అమలాపురం అఖండ గోదావరి నది ఎగువ పరివాహక ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాలకు ధవలేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ వద్ద వరద నీరు భారీగా చేరుతోందని, రాబోయే మూడు రోజుల్లో సుమారు 5 లక్షల క్యూసెక్కులు వచ్చే అవకాశం ఉన్నదని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ధవళేశ్వరం బ్యారేజ్ నుండి 1,90,000 క్యూసెక్కుల వరదనీరు దిగువకు విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే జిల్లా యంత్రాంగం వరద ముందస్తు చర్యల్లో భాగంగా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకున్నదన్నారు. జిల్లా కలెక్టర్ వారి కార్యాలయంలో మరియు ధవళేశ్వరంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆలమూరు మండలం బడుగువానిలంక, కపిలేశ్వరపురం మండలం అద్దంకి వారిలంక, కేదారిలంక, పాలేపులంక, కే గంగవరం మండలం శేరిలంక కోటిపల్లి, పి గన్నవరం మండలం, జీ పెదపూడి ఎనిమిది బోట్లు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ బోట్లు నిర్వహణ సంబంధించి మత్స్యశాఖ అధికారులు నియమించడం జరిగిందని ఆయన ప్రకటన తెలిపారు.

అనపర్తిలో వైసీపీ- టీడీపీ వర్గాల ఘర్షణ- ఉద్రిక్తత

విశాలాంధ్ర - అనపర్తి : అనపర్తి ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి సేకరించిన విరాళాల్లో అవి నీతి జరిగిందంటూ రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి పై ఆరోపణలు చేయడంతో గత రెండు మూడు రోజులుగా ఇరు వర్గాల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు, సవాళ్లతో అనపర్తి రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఇరు వర్గాలు కయ్యానికి కాలు దువ్వడంతో కొద్దిసేపు తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. గతంలో జరిగిన బిక్కవోలు గణపతి ఆలయంలోని సత్య ప్రమాణం రాష్ట్రంలోనే సంచలనం సృష్టించగా మరోసారి అనపర్తిలో ఇరు పార్టీల వర్గాలు అవినీతి ఆరోపణలపై ప్రత్యక్షంగా తేల్చుకోవడానికి బహిరంగ చర్చకు సిద్ధపడటంతో ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంతంలో బుధవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. వైసిపి టిడిపి నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున దేవి చౌక్ ప్రాంతానికి చేరుకోవడంతో రెండు వర్గాల మధ్య తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. రా అంటే రా అంటూ వైసిపి టిడిపి వర్గాలు చేతులు ఊపుకుంటూ కేకలు వేసుకోవడంతో పోలీస్ సిబ్బంది తో అక్కడికి చేరుకున్న సిఐ విప్పర్ల శ్రీనివాస్ ఇరు వర్గాలకు నచ్చ చెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ఆగకుండా ఇరు పార్టీల నాయకులు కయ్యానికి కాలు దువ్వుతూ కవ్వింపులకు పాల్పడ్డారు. దేవి చౌక్ ప్రాంతం నుండి ప్రభుత్వ ఆసుపత్రి వరకు రెండు పార్టీల నాయకులతో రోడ్ కిక్కిరిసిపోయింది. హఠాత్తుగా జరిగిన సంఘటనతో మార్కెట్, రైల్వే స్టేషన్ వైపుకు వెళ్లే ప్రజలు ఏమి జరుగుతుందోనని భయభ్రాంతులకు గురై జరుగుతున్న ఘర్షణపై ఆరా తీశారు. ఘర్షణ జరుగుతున్న సమయంలో రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అక్కడికి రావడంతో మళ్లీ కొద్దిసేపు ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. దీంతో సిఐ నల్లమిల్లికి నచ్చచెప్పి టిడిపి వర్గాన్ని అక్కడనుండి పంపి వేయడంతో ఎటువంటి వివాదానికి తావు లేకుండా సద్దుమణిగింది.దీంతో జనాలు ఊపిరి పీల్చుకున్నారు.

షాపింగ్ కాంప్లెక్స్‌పై వర్షపు నీరు నిల్వ

విశాలాంధ్ర - మండపేట : కలువపువ్వు సెంటర్ ఎదురుగా ఉన్న వేగుళ్ల వీర్రాజు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ లోకి వర్షపు నీరు వచ్చేస్తున్నది. వర్షాల కారణంగా కాంప్లెక్స్ పైన కురిసిన వర్షానికి నీరు నిలబడి పోయి చెరువులా మారింది. పైప్ లైన్లు పూర్తిగా మూసుకుపోయి కురిసిన వర్షం కిందకు దిగడం లేదు. దీనివల్ల స్లాబు లీకులు ఏర్పడి కింద ఉంటున్న షాపుల్లోకి వర్షం వచ్చేస్తున్నదని షాపు యజమానులు తెలిపారు. స్లాబ్ పటుత్వం తగ్గి స్లాబ్ కు బీటలు వారి అందులోంచి నీరు దారలా వస్తుందని తెలిపారు. మున్సిపల్ అధికారులు దీనిపై వెంటనే స్పందించి పైప్ లైన్లు బాగు చేసి వర్షం నీరు నిలబడకుండా చూడాలని, మరమ్మతులు కూడా చేపట్టాలని షాపు యజమానులు కోరుతున్నారు.

నాడు నేడు పనులకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలి

కలెక్టర్ డాక్టర్ కే. మాధవీలత

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలలో నాడు నేడు పనులకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి ఆ మేరకు నిధులను విడుదల చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె మాధవి లత పేర్కొన్నారు. బుధ వారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి పాఠశాలలో నాడు నేడు పనులు, ప్రాధాన్యత భవనాలు పై మండల స్థాయి అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ కె. మాధవీలత మాట్లాడుతూ, జిల్లాలో 654 పాఠశాలలలో రూ.49.52 కోట్లతో చేపడుతున్న నాడు నేడు పనులను అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పూర్తి చేయాలన్నారు. అదనపు తరగతి గదులు, మరుగు దొడ్లు, విద్యుత్, త్రాగునీటి సరఫరా, గ్రౌండ్ ఫ్లోర్, తదితర పెండింగ్ పనులను త్వరిత గతిన చేపట్టాలని పేర్కొన్నారు. ఆయా నిర్మాణాలకు అవసరమైన మెటీరియల్‌ను కూడా సిద్ధం చేసుకుని, మండల విద్యా అధికారులు వ్యక్తిగత పర్యవేక్షణ బాధ్యతలను చేపట్టాలని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా 2293 పనులకు సంబంధించి రూ.20.31 కోట్ల మేర పనులు పూర్తి కాగా ఇప్పటి వరకు 2268 పనులకు చెందిన రూ.17.62 కోట్ల వివరాలు అప్లోడ్ చేశారని, మిగిలిన వాటి వివరాలు వెంటనే అప్లోడ్ చెయ్యాలని ఆదేశించారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో డిఈఓ ఎస్. అబ్రహం, ఎస్ ఈ పిఆర్ ఎ బి వి ప్రసాద్, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ ఈ డి. బాల శంకర రావు లు పాల్గొన్నారు.

కోటా కేటాయించినప్పుడే రాజ్యాధికారం

విశాలాంధ్ర - అనపర్తి : ఈనెల 24, 25 తేదీల్లో జాతీయ బీసీ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య ఆదేశాల మేరకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద హలో బిసి-చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని జాతీయ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ అనుసూరి పద్మలత తెలిపారు. బుధవారం అనపర్తిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పద్మలత మాట్లాడుతూ పార్లమెంటులో బీసీ బిల్లు, మహిళా బిల్లు, బీసీ మహిళలకు సబ్ కోటా కేటాయించినప్పుడే రాజ్యాధికారం తగ్గుతుందని అన్నారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు వాటా ఇవ్వాలని డాక్టర్ పద్మలత విజ్ఞప్తి చేశారు. స్త్రీలపై అత్యాచారాలు, హత్యలకు సినిమా రంగం, సీరియల్స్, సోషల్ మీడియా ప్రభావితం చేస్తుందని పద్మలత అన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, వాసంశెట్టి కోటేశ్వరరావు, స్టేట్ మహిళా ఉపాధ్యక్షురాలు కొల్లేపల్లి సుభాషిని, యువసేన స్టేట్ మహిళా విభాగ ప్రధాన కార్యదర్శి ఏలూరు విజయలక్ష్మి, రామేశ్వరపు భార్గవి, సలాది వీరలక్ష్మి, పితాని మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్లు

విశాలాంధ్ర - దేవరపల్లి :దేవరపల్లి మండలంలో పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు అద్వాన స్థితిలో ఉన్నాయి. వర్షం పడితే ఆ రోడ్లు గుండా ప్రయాణించా లంటే చాలా అవస్థలు పడవలసి వస్తున్నది. మండలంలో చిన్నాయ గూడెం నుండి కుంతల గూడెం వెళ్లే రహదారి పెద్ద గోతులతో వర్షపు నీరు ఉండటంతో వాహనదారులు ప్రయాణించాలంటే వారు పడే అవస్థలు వర్ణనాతీతం. ఒక్కొక్కసారి మోటార్ సైకిళ్లు పడిపోయి వాహన చోదకులకు గాయాలయ్యాయి. వాహనాలు కూడా దెబ్బతింటున్నాయి. చిన్నాయ గూడెం టు కుంతల గూడెం రహదారి కొండ ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం. ద్వారకాతిరుమల దగ్గర మార్గం కావడంతో దేవరపల్లి కొయ్యలగూడెం మండలాల నుండి భక్తులు ఈ మార్గం గుండా వెళుతూ ఉంటారు. మూడు మండలాలకు చెందిన రైతులకు తమ వ్యవసాయ ఉత్పత్తులు తీసుకురావడానికి ఇదే ప్రధాన మార్గం కావడంతో ఈ రోడ్డును మరమ్మతులు చేపట్టవలసి ఉంది. చిన్నాయగూడెం టు గాంధీనగరం మార్గం మధ్యలో పాలేటి వాగు ఉంది. ఈ వాగు దాటి ప్రయాణించాలంటే నానా అవస్థలు పడవలసిందే. పాలేటి వాగు బ్రిడ్జి గుండా వెళ్లాలంటే వాగుపై రక్షణ కూడా సరిగా లేకపోవడం వలన ప్రయాణికులు వాహనాలు అదుపుతప్పితే వాగులో పడిపోవాల్సిందే. వర్షాలు ఎక్కువగా కురిస్తే ఈ వాగు ఉధృతంగా ప్రవహించి పలు సమస్యలకు కారణభూతమవుతుంది. ఎర్నగూడెం టు సంగారెడ్డి రోడ్డు కూడా అధ్వానంగా ఉంది. గజానికి ఒక గొయ్యి ఏర్పడి మోటార్ సైకిల్ పై వెళ్లేవారు అదుపుతప్పి పడిపోయే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. లక్ష్మీపురం సున్నం బట్టి రోడ్డు నుండి పల్లంట్ల కురుకూరు మార్గం పూర్తిగా పాడైంది. గతంలో ఈ రోడ్డు నిర్మాణానికి రాజమహేంద్రవరం మాజీ ఎంపీ మాగంటి మురళీమోహన్ దాదాపు పది కోట్ల నిధులతో భూమి పూజ కూడా చేశారు అనంతరం ఎన్నికలు రావడంతో మాగంటి ఓటమి చెందారు ఇప్పటికీ ఆ రోడ్డుపనులు చేపట్టలేదు. ప్రస్తుతం గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఈ రోడ్డు నిర్మాణానికి 35 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎర్నగూడెం త్యాజంపూడి రోడ్డు మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేస్తామని తెలిపారు.

కాకినాడ నగరపాలక సంస్థ

ఆర్.ఓ.సి.నెం.3761/22/ఎఫ్1 తేది : 18-07-2023

షార్ట్ టెండరు నోటీసు

కాకినాడ నగర పాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ నిమిత్తము మరియు దోమల నియంత్రణ నిమిత్తము ఈ క్రింది తెలిపిన అయిటంలు కొనుగోలు చేయుటకు షార్ట్ టెండరు కోరబడుచున్నవి. సదరు టెండరు కమీషనరు వారిచేగాని వారి అనుమతి పొందిన అధికారిచే గాని స్వీకరించబడును. సదరు టెండర్లు ది. **24-07-2023**వ తేదీ సాయంత్రం గం. **4.00**లకు స్వీకరించి అదేరోజు సాయంత్రం గం. **4.30**లకు అప్పటికి హాజరైన టెండరుదారుల సమక్షములో తెరువబడును. టెండరు షెడ్యూలు ఖరీదు చెల్లించుటకు మరియు ధరావత్తు చెల్లించుటకు ఆఖరు తేదీ : **22-07-2023.**

అయిటం నెంబరు	సప్లయి చేయవలసిన ఐటెం వివరములు	కావలసిన సంఖ్య	అంచనా మొత్తము రూ.(అన్ని టాక్సులతో కలిపి	ధరావత్తు రూ. (1%)	టెండరు షెడ్యూలు ఖరీదు రూ.
1.	మస్కిటో నెట్స్ (300mmx 150mm ISI Make stitching covers (శాంపిల్ టైప్)	20000నెం.	రూ.4,00,000/-	రూ.4,000/-	1000+ 180 GST
2.	ఆయిల్ బాల్స్ (శాంపిల్ టైప్)	4900 నెం.	రూ.4,40,000/-	రూ.4,400/-	1000+ 180 GST

ఇతర విషయములు ఆఫీసు పనిచేయు వేళలయందు ప్రజారోగ్య విభాగమునందు తెలుసుకొనవచ్చును.

నోట్ : దాఖలు చేయు టెండరు కవరుపై తప్పనిసరిగా అయిటం నెంబరుతో వివరములు వ్రాయవలెను.

సం/- కమిషనరు, నగరపాలక సంస్థ, కాకినాడ.

బ్యాంకు లావాదేవీల సందేహాలపై సదస్సు

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : బ్యాంకుల జాతీయకరణ దినోత్సవాన్ని శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కేజీఆర్ఎల్ కళాశాలలో పీజీ, డిగ్రీ, కామర్స్ విద్యార్థులతో బుధవారం సదస్సు నిర్వహించారు. బ్యాంక్ లావాదేవీలపై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రిటైర్డ్ చీఫ్ మేనేజర్ ఎం.పురుషోత్తం, కెనరా బ్యాంక్ మేనేజర్ పి.శ్రీనివాస్ మాట్లాడుతూ 1969లో ప్రధాన మంత్రి

ఇందిరాగాంధీ బ్యాంక్‌ల ప్రైవేటీకరణను రద్దు పరిచి 15 బ్యాంక్ లను జాతీయం చేశారని, 1969 జులై 19న ఈ వ్యవస్థ ప్రారంభించబడిందని, ప్రైవేటీకరణ నుంచి బ్యాంకులు జాతీయ బ్యాంక్ లుగా మంచి స్థానాలను సాధించుకున్నాయని అన్నారు. బ్యాంకులు జాతీయకరణ చేసిన తరువాత మారుమూల ప్రాంతాల్లో చిన్న గ్రామాలు సైతం జాతీయ బ్యాంకులు నిర్వహించబడుతున్నాయని అన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఐ. శ్రీరామచంద్రమూర్తి, పీజీ డైరెక్టర్ డాక్టర్ తోట రామమూర్తి మాట్లాడుతూ తద్వారా లక్షలాది మంది బ్యాంకుల్లో ఉద్యోగాలు సాధించారని అన్నారు. విద్యార్థులు ఈ బ్యాంక్ వ్యవస్థపై పూర్తి అవగాహనతో ఉండాలన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్ లు సుమారు 25 బ్రాంచ్ లున్నాయని, కోట్లాది రూపాయల ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నాయని అన్నారు. ప్రభుత్వాలు బ్యాంక్ ద్వారా రైతులు, చిన్న వ్యాపారులు విద్యార్థులకు కూడా అనేక సంక్షేమ పథకాలను అందిస్తుందని అన్నారు. ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ కే సత్యనారాయణ, నాచు శ్రీవల్లి, కామర్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం కోసమే ప్రభుత్వం కృషి

విశాలాంధ్ర - జీలుగుమిల్లి : గాంధీజీ కలలు కన్నా గ్రామ స్వరాజ్యం కోసమే ఈ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ కోర్సా పోసమ్మ జడ్పిటిసి మల్లం వసంతరావులు అన్నారు బుధవారం స్వర్ణ వారి గూడెం గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వారు పాల్గొన్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు కార్యాలయాలు చుట్టూ

తిరగ కుండా ఆ గ్రామాలలోని సచివాలయాలు ఏర్పాటు చేసి గ్రామాభివృద్ధికి ఈ ప్రభుత్వం పాటుపడుతుందని అన్నారు ప్రజలు వద్దకే పాలన అనే విధంగా ఈ వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు ఇంకా ప్రభుత్వ పథకాలు అందని వారు ఉంటే గుర్తించి వారికి అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు అనంతరం సర్టిఫికెట్లను పంపిణీ చేసి మొక్కలను నాటారు కార్యక్రమంలో మండల వైఎస్ఆర్సిపి కన్వీనర్ గూడవల్లి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ ఎస్ శ్రీనివాసరావు, ఎంపీడీవో కే కృష్ణ ప్రసాద్, తహసిల్దార్ జి సుందర్ సింగ్, స్వర్ణ వారి గూడెం సర్పంచ్ సుపా వెంకటేశ్వరరావు ,టీ గంగన్నగూడెం సర్పంచ్ కోర్స వెంకటలక్ష్మి, ఎంపీటీసీ ముడియం వెంకట్ లక్ష్మి ,మాజీ సర్పంచ్ కోర్స సోమరాజు, ఉద్యానవన శాఖ అధికారి ఆర్ఎన్ మణిమాల, పశు వైద్యాధికారిణి జే లక్ష్మీ ప్రసన్న, నాయకులు కొఠారి వీరరాఘవులు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.14కోట్లతో పోలవరంలో సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర - చాట్రాయి : జగన్ పాలనలో పోలవరం గ్రామంలో రూ. 14 కోట్లతో వివిధ సంక్షేమ పథకాలను గ్రామస్తులకు అందించడం జరిగిందని పోలవరం పిఎసిఎస్ చైర్పర్సన్ చెలికాని బాబ్జి తెలిపారు. బుధవారం పోలవరం గ్రామంలో ప్రభుత్వం నిర్వహించిన జగనన్న సురక్ష సభలో ఆయన మాట్లాడుతూ

గ్రామంలో 726 మంది లబ్ధిదారులకు రూ.19లక్షల 26 వేల పింఛన్లు ప్రతీ నెలా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అన్ని సంక్షేమ పథకాలలో రూ.14కోట్ల వరకు పంపిణీ చేసి సామాన్యులకు ఆర్థిక భరోసా ఇవ్వడం జరిగిందన్నారు. సాంకేతిక సమస్యల వలన కొంత మందికి అర్హత వున్నా పథకాలు అందడం లేదని అధికారులు వ్యక్తిగత శ్రద్ధతో వారి సమస్యను పరిష్కరించాలని కోరారు. ప్రజలందరూ జగన్నన్నకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలవరం గ్రామ సర్పంచ్ సత్తెనపల్లి లక్ష్మి, ఎంపిటిసి వేముల చిన్న, వేంకటేశ్వరరావు, ఎంపిడిఓ దుర్గా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ మొక్కలు నరికిన వ్యక్తుల పై కేసు నమోదు

విశాలాంధ్ర-టి నరసాపురం : పామాయిల్ మొక్కలు నరికిన వ్యక్తులపై కేసు నమోదు చేసి నట్లుగా ఎస్ ఐ కె సతీష్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణా రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన రావు శ్రీదర్ కు టి నరసాపురం మండలం మక్రిగూడెం గ్రామంలో సర్వే నెంబరు:586/2, 587/6 లో వ్యవసాయ భూమి వుంది. మక్రిగూడెం గ్రామానికి చెందిన పూనెం కళ్యాణ్, పూనెం బాబురావు, తుట్టి నాగేశ్వరరావు కొంతమంది మొత్తం 15 మంది మూడు ట్రాక్టర్లతో రావు శ్రీధర్ వ్యవసాయ భూమిలోనికి అక్రమంగా ప్రవేశించి 50 పామాయిల్ మొక్కలు నరికి, ఆభూమిని దున్ని ప్రత్తి గింజలు నాటినట్లు శ్రీధర్ ఫిర్యాదుతో బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

హెల్మెట్ తప్పనిసరి

విశాలాంధ్ర - పెనుమంట్ర : ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరు తప్పనిసరి హెల్మెట్ ధరించాలని పెనుగొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం మార్టేరు నాలుగు రోడ్ల జంక్షన్లో ద్విచక్ర వాహనదారులకు ప్రమాదాల నియంత్రణకు హెల్మెట్

పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్మెట్ రక్షణ కవచం లాంటిదని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా ఈ నిబంధన పాటించాలని అన్నారు. లేనిపక్షంలో ఏవీఐ యాక్టు ప్రకారం కఠిన చర్యలు తప్పమన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, ఫోన్లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, పరిమితికి మించి ప్రయాణికులు వాహనాల్లో వెళ్లడం, వంటి వాటిని నియంత్రించగలిగితే రోడ్డు ప్రమాదాలు జరగవని ఆయన అన్నారు. ఆయనతోపాటు పెనుమంట్ర పోలీస్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

కరాటేలో శ్రీచైతన్య విద్యార్థులకు బహుమతుల వెల్లువ

విశాలాంధ్ర -ఏలూరు : ఏపీ స్టేట్ లెవెల్ కరాటే టోర్నమెంట్- నరసాపురం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీలలో స్థానిక శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు తమ సత్తా చాటారు. సుమారు 500 పైగా పాల్గొన్న

ఈ పోటీలలో తమ విద్యార్థులు కుమితే, కట్టా విభాగాలలో పలువురు ప్రథమ, ద్వితీయ,కన్సోలేషన్ బహుమతులు సాధించారని ప్రధానోపాధ్యాయురాలు బి. శివకుమారి తెలిపారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య విద్యాసంస్థల రీజనల్ ఇంచార్జ్ ఎస్ .పార్థసారథి, జోనల్ ఎకడమిక్ కోఆర్డినేటర్ సిహెచ్. ఉదయభాస్కర్, ఎకడమిక్ డీన్ జాల సంజీవ్ కుమార్, మరి ఇంచార్జ్ నరీనా విద్యార్థులను ,వారి తల్లిదండ్రులను,కరాటే మాస్టర్ శ్రీనివాస్ ని ప్రత్యేకంగా అభినందించారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : భీమవరం మండలంలో జరుగుతున్న అభి వృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఎంపీడీవో కే వెంకటలక్ష్మి ని ఆదేశించారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం స్థానిక క్యాంపు కార్యాలయంలో

ఎంపీడీవోతో అభివృద్ధి పనులకు సంబం ధించి సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటుగా మరికొన్ని అభివృద్ధి పనులకు సంబంధించి నిధుల మంజూరుకు చర్యలు తీసుకోవడం జరిగిందని అన్నారు.

కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు

విశాలాంధ్ర - కాళ్ళ: ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలన్నీ కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. కాళ్ల మండలంలో బుధవారం ఆమె పర్యటించారు. దీనిలో భాగంగా కోపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సందర్శించారు. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన కోపల్లె హైస్కూల్ శిథిలావస్థకు చేరడంతో డిసిసిబి చైర్మన్ పివిఎల్ నరసింహారాజు ద్వారా గ్రామపెద్దలు, జడ్పిటిసి పచ్చిగోళ్ళ సోమేశ్వర రావులు జడ్పీ చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో డిసిసిబి చైర్మన్ పివిఎల్ నరసింహా రాజుతో కలిసి ఆమె పాఠశాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనం ఎలా ఉంటుందని, ఉపాధ్యాయులు చదువు ఎలా చెబుతున్నారని, ఏదైనా సమస్యలు ఉన్నాయా.? అంటూ విద్యార్థుల్ని అడిగి తెలుసుకున్నారు. నూతనంగా నిర్మిస్తున్న అదనపు తరగతి గదులను, టాయిలెట్స్

మెయింటినెన్స్ ఎలా ఉందో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం భోజనంను ఆమె స్వయంగా తిని రుచి చూశారు. శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాన్ని పరిశీలించారు. ముందుగా పెదఅమీరం గ్రామంలో ఉన్న పార్టీ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో జడ్పిటిసిలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన కోపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శిథిలావస్థకు చేరిందని తన దృష్టికి తీసుకురావడంతో పాఠశాలను పరిశీలించేందుకు వచ్చినట్లు తెలిపారు. పాఠశాల పునర్నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఇప్పటికే నాడు నేడు పథకంలో భాగంగా సుమారు రూ. 60 లక్షలతో కాంపౌండ్ వాల్, అదనపు తరగతి గదుల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. అనం తరం డిసిసిబి చైర్మన్ పివిఎల్ నరసింహారాజు మాట్లాడుతూ ఎంతో పేరు ప్రఖ్యాతలు ఉన్న కోపల్లె హైస్కూల్ పునర్నిర్మాణానికి జిల్లా పరిషత్ చైర్మన్ సహకరిస్తానని చెప్పటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాళ్ళ, ఆకివీడు, ఉండి జెడ్పిటిసిలు పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, వేగేశ్న వెంకటరాజు, రణస్థుల మహంకాళి, ఎంపీపీ పెన్మెత్స విశ్వనాథరాజు, వైసీపీ మండల అధ్యక్షుడు గణేశ్న రాంబాబు, కలవపూడి సొసైటీ అధ్యక్షుడు పెన్మెత్స ప్రసాదరాజు, గోళ్ళ వెంకట సత్యనారాయణ, సాగిరాజు హరివర్మ, వీరమల్లు బోసు, దంతులూరి కోటేశ్వరరాజు, వీరమల్లు గంగయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

28.3 కేజీల గంజాయి పట్టివేత

10 మంది అరెస్ట్

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: అక్రమంగా తరలిస్తున్న 28.3 గంజాయిని స్వాధీనం చేసుకుని పదిమంది మిత్రులను అరెస్టు చేసినట్లు డి.ఎస్.పి ధనుంజయుడు బుధవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. డిఎస్పి తెలిపిన వివరాల ప్రకారం తమకు అందిన సమాచారం మేరకు పట్టణం సీఐ పి.రాజేష్, ఎస్ఐ ఎం.జయబాబు పట్టణంలోని మార్కండేపురం శివారులో దాడులు నిర్వహించారన్నారు. ఈ దాడుల్లో గంజాయి సేవిస్తున్న 10మంది వ్యక్తులను గుర్తించామన్నారు. వీరిని అదుపులోకి తీసుకుని తనిఖీచేయగా, వీరి వద్ద సుమారు 28.3 కేజీల గంజాయి గుర్తించామన్నారు. దీంతో గంజాయిని, 7 సెల్‌ఫోన్‌లను, రూ. 2500 నగదును స్వాధీనంచేసుకుని 10మందిపై కేసు నమోదు చేశామన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. గంజాయి విలువ సుమారు రూ. 14వేల 1,00 ఉంటుందన్నారు. ఈ దాడుల్లో ఏఎస్ ఐ ఎస్‌వీ సంపత్‌కుమార్, కె.గంగాధరరావు, హెచ్‌సీ ఎస్.రాజేంద్రప్రసాద్, పీసీలు కె.సత్యనారాయణ, ఎస్.రమేష్, సీహెచ్ సత్యనారాయణ, కె.మణికుమార్, ఎస్‌కే షాజహాన్, ఎం.సతీష్, జి.సుజన్‌కుమార్, హోంగార్డ్ వైఎస్ఆర్‌వీ ప్రసాద్, వి.బాలస్వామిలు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు గ్యారెంటీ మేనిఫెస్టో ద్వారా ప్రజలకు మేలు

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు ప్రవేశపెట్టిన భవిష్యత్ గ్యారెంటీ మేనిఫెస్టో ద్వారా రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని కొయ్యలగూడెం మండల అధ్యక్షులు

పారేపల్లి నరేష్ పేర్కొన్నారు. మండలంలో కన్నాపురం గ్రామంలోబుధవారం భవిష్యత్ గ్యారెంటీపథకంలో భాగంగా మహాశక్తి కార్యక్రమాన్ని నిర్వహించారు.గ్రామంలోని ఇంటింటికి, దుకాణాలకు వెళ్లి చంద్రబాబు ప్రవేశపెట్టబోయే పథకాలను వివరించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడానికి ప్రతి ఒక్కరు ఓటు వేసి గెలిపించాలని కోరారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మరల రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు రావాలని నరేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలవరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పారేపల్లి రామారావు, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు చింతల వెంకటరమణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు బొమ్మ గంటలయ్య,ఎంపీటీసీ సభ్యులు కాగితాల గణపతి, షేక్ సయ్యద్ బాజీ, చాపల చినబాబు, కుంజా సుభాషిని, వినోద్ కుమార్,ఆకుల అరుణ, పెండ్యాల రమాదేవి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరోసారి వ్యాఖ్యలు చేస్తే వైసీపీ ఆగ్రహం చవిచూస్తావు

విశాలాంధ్ర - పాలకొల్లు: చింతకాయల అయ్యన్నపాత్రుడు తన భాష మార్చుకోకుంటే ప్రజల నుండి భంగపాటు తప్పదని, మరోసారి ఈ విధమైన వ్యాఖ్యలు చేస్తే వైసిపి ఆగ్రహం చవిచూస్తావని

ఎమ్మెల్సీ కవురు శ్రీనివాసరావు హెచ్చరించారు. బుధవారం పాలకొల్లు వైసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల పాలకొల్లులో టిడిపి ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారనీ, ఈ కార్యక్రమంలో అయ్యన్నపాత్రుడు దిగజారి ముఖ్యమంత్రి జగన్ పై దుర్భాషలాడుతూ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఇటువంటి దుర్భాషలాడే రాజకీయం మానుకోవాలని, లేకుంటే జీవితంలో ఇబ్బంది పడతావంటూ అయ్యన్నపాత్రుడిని హెచ్చరించారు. సీనియర్ వైసీపీ నాయకులు గుణ్ణం నాగబాబు మాట్లాడుతూ 2024 సంవత్సరంలో తెలుగుదేశం ప్రభుత్వానికి నాయకులకు అధికారంలోకి వచ్చే గ్యారెంటీ లేదని, పాలకొల్లులో నాలుగు మొక్కలు నాటి టీడ్కోకు రంగులు వేస్తే అది అభివృద్ధి కాదని స్థానిక ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు తెలుసుకోవాలని అన్నారు తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో 351 వేల కోట్లుఅవినీతి చేశారని, మీరు అధికారంలోకి వస్తే ఏం అభివృద్ధి చేస్తారో ప్రకటించాలని గుణ్ణం నాగబాబు ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకుడు, జిన్నూరు సొసైటీ అధ్యక్షుడు డిటీడిసి బాబు తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి

విశాలాంధ్ర -ముసునూరు : జ్వరం వచ్చినవెంటనే డెంగీ వ్యాధి నిర్ధారణ పరిక్షలు చేయించుకోవాలని రమణక్కపేట పిహెచ్‌సి వైద్యులు కరిముల్లా పేర్కొన్నారు. బుధవారం మండలంలోని రమణక్కపేట గ్రామంలో పిహెచ్‌సి వైద్యులు కరిముల్లా ,నూజివీడు

డివిజన్ సబ్ యూనిట్ అధికారి యం.యలమంద ఆధ్వర్యంలో డెంగ్యూ నివారణ మాసోత్సవం పై ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ కరిముల్లా మాట్లాడుతూ వర్షాకాలంలో జ్వరం భారిన పడకుండా వుండేందుగాను ముందుస్తూ జాగ్రత్త చర్యలగా తమ ఇంటి పరిసర ప్రాంతాల్లో వర్షం నీరునిల్వ లేకుండా చూసుకోవాలని,అలాగే మంచినీరు కలుషితం లేకుండా చూసుకోవాలని ,గ్రామ పంచాయితీ పరిధిలో గ్రామస్థులకు వాడే మంచినీరు వాటర్ ట్యాంక్‌లలో బ్లీచింగ్ చల్లుకోవాలని,పలు సలహాలు,సూచనలు తెలియచేశారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది,రాణీ,అమరావతి ,ఆశాలు,అంగన్‌వాడి సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి ఎంఈఓ1గా బాలామణి

విశాలాంధ్ర - తాళ్లపూడి : తాళ్లపూడి మండలానికి ఎంఈఓ1 గా వేగేశ్వరపురం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చింతాడ బాలామణి నియమితులయ్యారు. ఈ మేరకు కాకినాడ ప్రాంతీయ సంచాలకుల

నుండి నియామక పత్రం అందుకున్న బాలామణి బుధవారం మండల విద్యా వనరుల కేంద్రంలో బాధ్యతలు స్వీకరించారు. జూన్ 8న ఇదే మండలానికి వచ్చిన వై సత్యనారాయణ జులై 2న జరిగిన బదిలీల్లో నల్లజర్లకు బదిలీ అయ్యారు. జూన్ 3నుండి జులై 18 వరకు ఎం ఈ ఓ 1 పోస్టు ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలో ఈ నెల జీతాలు వస్తాయో రావో అని ఉపాధ్యాయులు సందిగ్ధంలో ఉండగా ఇప్పుడు ఎంఈఓ1ను నియమించటంతో ఉపాధ్యాయులకు ఊరట కలిగింది. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఒకటవ మండల విద్యాధికారి బాలామణికి ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ తూర్పుగోదావరి జిల్లా శాఖ అధ్యక్షులు దున్నా దుర్గారావు స్వాగతం తెలియపలికారు. ఈ కార్యక్రమం లో ఏపీటీఎఫ్ మండల శాఖ ఉపాధ్యక్షులు వై శంకరం, ఎం జయబాబు, వేగేశ్వరపురం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పి సుభాషిణి, సంధ్య, భరత్, పృథ్వీ , రామ చల్లయ్య, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నిరాధార ఆరోపణలు చేస్తే సహించం

విశాలాంధ్ర - అనపర్తి : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో అవకతవకలు జరిగాయని మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అనవసర ఆరోపణలు చేస్తూ అవాకులు చవాకులు పేలుతున్నారని రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు) తీవ్రంగా విరుచుకుపడ్డారు.

ఆసుపత్రి పర్యవేక్షణ కమిటీ మొత్తం వివరాలను వెల్లడిస్తామని చెప్పినప్పటికీ బాధ్యతగా వచ్చి చూడవలసింది పోయి రోడ్డుకెక్కి రచ్చ రచ్చ చేయడం సబబు కాదంటూ రాంబాబు ధ్వజ మెత్తారు. ఇకపై నీతి నిజాయితీపరుడైన ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి పై ఎటువంటి నిరాధార ఆరోపణలు చేసిన సహించేది లేదని రాంబాబు మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిని హెచ్చరించారు. ఢీ అంటే ఢీ అనడానికి మేము కూడా సిద్ధంగా ఉన్నామని రాంబాబు టిడిపి కి గట్టి సవాల్ విసిరారు. దమ్ముంటే వచ్చి విరాళాల వివరాలు చూసుకోవా లన్నారు. వివరాలు చూపిస్తామంటే తోకముడిసి జారుకున్నారని సత్తి రామకృష్ణారెడ్డి వ్యంగ్యంగా అన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - రావులపాలెం : పెరాలసిస్‌తో బాధపడుతున్న రావులపాలెం మండలం వెదిరేశ్వరం గ్రామం పితాని వారి పాలెంకు చెందిన గుబ్బల వెంకట సత్యంను ప్రభుత్వ విప్ మరియు శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి పరామర్శించి

రూ.5000లు, అనారోగ్యంతో బాధపడుతున్న కుడుపూడి శ్రీనును పరామర్శించి రూ.5,000లు, గుత్తుల వెంకన్నను పరామర్శించి రూ.3,000లు, గుత్తులవారి పాలెంకు చెందిన పితాని జయశ్రీని పరామర్శించి రూ.5000లు ఆర్థిక సహాయం అందచేశారు.

ఎస్ఈబి దాడులు

యానాం మద్యం పట్టివేత

విశాలాంధ్ర - ఆత్రేయపురం : డా బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ ఎస్ శ్రీధర్, అడిషనల్ ఎస్పీ ఖాదర్ బాషా ఆదేశాల మేరకు బుధవారం కొత్తపేట ఎస్ఈబి స్టేషన్ పరిధిలో వచ్చిన సమాచారం మేరకు,

ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో కొత్తపేట ఎస్ఈబి పోలీసులు, అమలాపురం టాస్క్ ఫోర్స్ పోలీసులు కలిసి దాడులు చేసి గ్రామానికి చెందిన కందవల్లి గనిరాజు అనే వ్యక్తిని అరెస్టు చేసి, అతనికి యానాం మద్యం సరఫరా చేసే, పశ్చిమ గోదావరి జిల్లా, పెనుగొండ మండలం చినమల్లం గ్రామానికి చెందిన గుడాల చంద్ర శేఖర్ స్వామి అనే వ్యక్తికి చెందిన ఒక స్విఫ్ట్ కారును, 500 యానాం మద్యం సీసాలను పట్టుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ ఎవరైనా జిల్లాలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే, చట్ట ప్రకారం కఠినంగా చర్యలు తీసుకుంటామని అవసరమైతే పిడి యాక్ట్ ప్రయోగించి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ఈ యానాం మద్యం కేస్ పట్టుకున్న కొత్తపేట ఎస్ఈబి సిఐ, మద్దాల శ్రీనివాస్‌ని, డిటిఎఫ్ సిఐ కె వీరబాబుని మరియు సిబ్బందిని అడిషనల్ ఎస్పీ ఖాదర్ భాషా అభినందించారు.

జగనన్న సురక్షతో ప్రతి ఒక్కరికి మేలు

విశాలాంధ్ర - కిర్లంపూడి : కిర్లంపూడి మండలం రామకృష్ణాపురం సచివాలయం ఆవరణలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం కిర్లంపూడి ఎంపీపీ తోట రవి ఆధ్వర్యంలో జరిగింది. వైసీపీ ప్రభుత్వంలో అన్ని విధాలుగా ప్రజలకు సంక్షేమ పథకాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని అర్హత ఉన్న ఏ లబ్దిదారులకైనా ప్రభుత్వ పథకాలు అందకపోతే జగనన్న సురక్ష కార్యక్రమం దృష్టికి తీసుకువస్తే అర్హత ఉన్న వాళ్ళందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజల సంక్షేమానికి ఎనలేని కృషి చేస్తున్నారని సందర్భంగా తోట రవి అన్నారు. కిర్లంపూడి ఎంపీడీవో బడే రాజేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఏ గ్రామంలో పనులు ఆ గ్రామంలోనే జరిగే విధంగా జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కిర్లంపూడి జడ్పిటిసి తోట గాంధీ, డిప్యూటీ తహసీల్దార్ ఎం శ్రీనివాస్ , సర్పంచ్ కంటా సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ దమన కాండకు నిరసనగా శాంతి ర్యాలీలు

విశాలాంధ్ర - సామర్లకోట : మణిపూర్ రాష్ట్రంలో గత రెండు నెలలుగా క్రైస్తవుల పైనా, క్రైస్తవ దేవాలయాల పైనా జరుగుతున్న దాడులు, దమనకాండలను వ్యతిరేకిస్తూ ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ (ఏఐసీసీ) ఆధ్వర్యంలో బుధవారం శాంతి నిరసన ర్యాలీలు నిర్వహించారు. సామర్లకోట, పెద్దాపురం పట్టణాలలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమాల్లో ఆర్డీవో సీతా

రామారావు, సామర్లకోట డిప్యూటీ తహసీల్దార్ ఆర్. శ్రీనివాసరావులకు వినతి పత్రాలు అందజేశారు. ఇటీవల కొద్ది కాలంగా మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవ ప్రజలను దారుణ హింసలకు గురి చేస్తూ క్రైస్తవ చర్చిలపై జరుగుతున్న దాడులను ఆపాలనీ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ నాయకులు టీ బ్లెస్సింగ్, ఆర్ లాజరస్, వి జాన్, ఎంఏ జేమ్స్, పి ఆనంద్ బాబు, ఏఐసిసి నాయకులు, ప్రజా పెద్దాపురం నియోజకవర్గ వైసిపి మైనార్టీ అధ్యక్షులు మడికి సోనియ, రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యా యులు ఎండివి ప్రసాద్, సూర్య కుమారి, రూత్ ప్రశాంతి, షర్మిల, మాధవి లాజరస్ పట్టణంలో యువనస్తులు, సామర్లకోట మండల పాస్టర్లు, ముస్లిం అంజుమన్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, షాహి జామియా మసీదు నాయకులు, క్రైస్తవ ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత బస్ పాస్‌లు

విశాలాంధ్ర - మండపేట : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బస్సు సౌకర్యార్థం ఉచితంగా బస్సు పాస్ లు అందిస్తున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి తెలిపారు. మండపేట పట్టణ జిల్లా

పరిషత్ బాలికోన్నత పాఠశాల, వేగుళ్ల సూర్యారావు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను చైర్ పర్సన్ దుర్గారాణి బుధవారం సందర్శించారు. విద్యార్థుల కనీస రుసుముతో 200 మంది విద్యార్థులకు బస్సు పాస్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎంలు మందేశ్వరరావు, ఆర్ నాగ కుమార్, పాఠశాల సిబ్బంది, రామచంద్రపురం ఆర్టీసీ డిపో ఉద్యోగులు కుమార్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ప్రారంభం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండలం కేంద్రంలో వసంతవాడ గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి కీ.శే. డాక్టర్ వైయస్ రాజశేఖర రెడ్డి, ప్రభుత్వ విప్, శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి హయాంలో నిర్మించిన డాక్టర్ చిర్ల సోమసుందర రెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను శాసన సభ్యులు చిర్ల జగ్గిరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల జెడ్పీటీసీ

బోనం సాయిబాబా, గాదిరాజు రామకృష్ణంరాజు సర్పంచ్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బంగారు కొండ లబ్దిదారులకు కిట్లు పంపిణీ

విశాలాంధ్ర - సీతానగరం: బంగారు కొండ పథకం లబ్దిదారులకు కిట్లు పంపిణీ చేసిన అంగన్వాడి పర్యవేక్షకులు. మండలంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బంగారు కొండ పథకం క్రింద మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో 54 మంది లబ్దిదారులను గుర్తించి వారికి వైద్య పరీక్షలు నిర్వహించిన సంగతి అందరికీ తెలిసిందే. ఆ లబ్దిదారులు అయినా

పిల్లలకు పోషకాహారం అందించడం కోసం బుధవారం వారికి బంగారు కొండ కిట్లను పంపిణీ చేశారు. ఈ కిట్లలో కందిపప్పు, పెసరపప్పు, వేరుశెనగ చిక్కీలు, రాగి పిండి, బెల్లం మొదలగు పోషక విలువలు కలిగిన పదార్థాలు ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

మాస్టారు సేవలు మరువలేనివి

విశాలాంధ్ర - కరప : వడ్డీ వెంకటేశ్వరరావు మాస్టారు సేవలు మరువలేనని ఎంఈఓ కేబి కృష్ణ వేణి తెలిపారు. కరప నక్క వారి పేట మండల ప్రాథమిక పాఠశాల నందు నెడ్కాఫ్ డైరెక్టర్ సాదే విజయలక్ష్మి వీర రాఘవులు ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీణాదరి అధ్యక్షతన జరిగిన ఆత్మీయ వీడ్కోలు సమావేశానికి ఎంఈఓ కృష్ణవేణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నెడ్కాఫ్ డైరెక్టర్ సాదే విజయలక్ష్మి రాఘవులు

మాట్లాడుతూ వడ్డీ వెంకటేశ్వరరావు మాస్టారు తమ పాఠశాలలో విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియం విద్యార్థులతో పోటీగా విద్యాబోధన చేసి వారి ఉన్నతకి కృషి చేశారన్నారు. నక్కవారిపేట స్కూల్లో అపరిష్కృతంగా ఉన్న పనులను వేగవంతం చేయడంలో వడ్డీ వెంకటేశ్వరరావు తనదైన ముద్ర వేశారన్నారు. మ్యాథ్స్‌లో మెగాస్టార్‌గా సైన్స్‌లో సూపర్ స్టార్‌గా ఆయన బోధన అద్భుతమని కొనియాడారు. వడ్డీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నక్కవారిపేట స్కూల్లో సుమారు ఏడున్నర సంవత్సరాల పని చేశానని ఇక్కడ పనిచేసిన నంతకాలం గ్రామవాసులు, పిల్లల తల్లిదండ్రులు నన్ను ఎంతో అభిమానించి ఆదరించారని కరపతో ఉన్న ఋణానుబంధం ఎప్పటికీ మర్చిపోలే నిది అన్నారు. అనంతరం వెంకటేశ్వరరావు మాస్టారుకు డైరెక్టర్ విజయలక్ష్మి రాఘవులు, ఎంఈఓ కృష్ణవేణి, పాఠశాల ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ2 పి సత్యనారాయణ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీణాదరి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మక్రి స్వర్ణకుమారి, టీచర్ దేగల లక్ష్మి, సిఐటియు మండలనాయకులు బుద్దాల రాంప్రసాద్, యుటిఎఫ్ జనరల్ సెక్రెటరీ రమణ, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

దుష్ప్రచారాన్ని నమ్మొద్దు

విశాలాంధ్ర-దేవరపల్లి: ప్రతిపక్ష నాయకుల దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పిలుపునిచ్చారు. దేవరపల్లి మండలం ఎర్నగూడెం జగనన్న సురక్ష సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండల వైసీపీ

అధ్యక్షుడు కూచిపూడి సతీష్ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమ పథకాలు సమపాళ్లలో అమలుపరిచి దేశంలోనే జగన్మోహన్ రెడ్డి ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలిచారని అన్నారు. ఈ సందర్భంగా ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జి. జనార్ధన రావు, దేవరపల్లి దుర్గారావు, సర్పంచి బొంత భరత్ బాబు, వాలంటీర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పెరవలి మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-పెరవలి : ప్రభుత్వం చేపడుతున్న అన్ని పథకాలను ఎప్పటికప్పుడు ప్రజలకు అందేలా ప్రతీఒక్కరు పనిచేయాలని ఎంపీపీ కార్చెర్ల సీతారామ్ ప్రసాద్ అన్నారు. బుధవారం పెరవలి మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో వివిధ శాఖల ద్వారా జరుగు తున్న ప్రభుత్వ పథకాలపై అధికారులు వివరించారు. యంపిపి మాట్లాడుతూ అధికారులు ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు ప్రజలకు చేరువుగా ఉండి వారికి అందాల్సిన అన్ని పథకాలు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు ప్రజాపతినిధులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా దొమ్మేరు శాఖ ఆధ్వర్యంలో రైతు మహాసభ

విశాలాంధ్ర-కొవ్వూరు రూరల్: బ్యాంక్ ఆఫ్ బరోడా దొమ్మేరు శాఖ ఆధర్యంలో రైతు మహాసదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఎస్.రాజీవం కృష్ణ, ప్రభుత్వ సలహాదారు ఎన్జేజేశ్వరరావు, డిప్యూటి జోనల్ మేనేజర్లు హాజరయ్యారు. ఈ సదస్సులో బ్యాంకు వారు రైతుల యొక్క విశిష్టతను కొనియాడారు. బ్యాంకులో రైతుల కోసం ఉన్న పథకాలను వివరించారు. బ్యాంకు ఆఫ్ ఇండియా ఈ నెలను రైతు మాసోత్సవంగా ప్రకటించి వ్యవసాయ రుణాలను ఇచ్చారు. ఈ సందర్భంగా రైతు మాసోత్సవం మంజూరు చేసిన రుణాల శాంక్షన్ ఉత్తర్వులను లబ్దిదారులకు ముఖ్యఅతిధి రాజీవ్ కృష్ణ చేతుల మీదుగా అందజేసారు. ఈ సదస్సులో దొమ్మేరు, పశివేదల, వాడపల్లి, అన్నదేవరపేట, మేనేజర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.